క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



డీఈవో రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: సర్కారు విద్యా సంస్థల్లో సమస్యలన్నీ పరిష్కరించాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కో కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ కోరారు. శనివారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య పాఠశాలలో టాయిలెట్స్ సరిగా లేవని, కేజీబీవీల్లో కనీస వసతులు కరువయ్యాయన్నారు. నాణ్యమైన ఆహారం అందక కేజీబీవీ విద్యార్థులు ఆకలికి అల్లాడుతున్నారని, గ్రీజర్లు లేక చన్నీళ్ల స్నానం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు సామనపల్లి ప్రశాంత్, లోపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట ఎంపీడీవోగా శ్రీనివాసమూర్తి



ఎంపీడీవో శ్రీనివాసమూర్తిని సన్మానించిన ఎంపీవో అరీఫ్ పాషా

కోనరావుపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీనివాసమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శశికళ ఇల్లంతకుంటకు బదిలీ కాగా, ఇల్లంతకుంటలో పనిచేస్తున్న శ్రీనివాసమూర్తిని కోనరావుపేటకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోకు ఎంపీవో అరీఫ్ పాషా, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటా ఆరోగ్య సమాచారం సేకరించాలి

కోనరావుపేట: గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ఆరోగ్య సమాచారం సేకరించాలని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని సుద్దాలలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న జ్వర సర్వే సక్రమంగా చేయాలన్నారు. జ్వరపీడితులను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించాలన్నారు.

గొల్లపల్లి యువకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న విజయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన గుర్రాల విజయ్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. కొన్నేళ్లుగా అతడు వైద్యరంగంలో సేవలందిస్తున్న కృషిని గుర్తించిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తమిళనాడులోని హోసూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్ అందజేసింది.

పాఠశాలకు బ్యాండ్ వితరణ

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చెకోటి మహేశ్‌యాదవ్–మౌనిక దంపతులు శనివారం బ్యాండ్ వితరణ చేశారు. హెచ్‌ఎం అజయ్‌కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ రజిత, ఉపాధ్యాయులు సతీశ్, శివరామకిరణ్, శిరీష, స్వప్న, కో ఆప్షన్ సభ్యుడు పాతూరి బాల్‌రెడ్డి, యూత్ నాయకులు నాగరా జు, అరుణ్, వెంకటేశ్, నారాయణ, కుమార్, మధు, జనార్దన్, శివకుమార్, దస్తగిరి పాల్గొన్నారు.

మధులతకు ఆర్థికసాయం

వీర్నపల్లి: మండలంలోని భావుసింగ్‌నాయక్ గ్రామపంచాయతీ గోన్యానాయక్ తండాకు చెందిన బదావత్ మధులత పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. ఆమె చదువు ఖర్చుల కోసం భూక్యతండాకు చెందిన లకావత్ వసంత్ నాయక్ రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలని ఎంపీవో అరీఫ్ పాషా ఆదేశించారు. కాగా తమ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంలేదని, నాగారం గ్రామస్తులు వాట్సాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీవో గ్రామానికి చేరుకుని విచారణ జరిపారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు.

యువకుల నిరసన



కోనరావుపేట: మండలంలోని మంగళ్లపల్లి గ్రామంలో వర్షాలకు రోడ్లపై నీరు నిలుస్తుండడంతో గ్రామ యువకులు రోడ్డుపై వరినాటు వేసి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

పసందైన పాన్

- అతిథులకు 'మిఠాయి' తాంబూలం
- సిరిసిల్లలో స్వీట్ పాన్‌లకు క్రేజ్
- శుభకార్యాల్లో పెరిగిన వాడకం
- పాన్‌టేలాలతో తరాలుగా ఉపాధి



సిరిసిల్లటౌన్: ఆకు.. వక్క.. మీఠాతో కట్టే మిఠాయి కిల్లీలకు సిరిసిల్ల పట్టణవాసులు ఫిదా అవుతున్నారు. శుభకార్యాల్లో ఇంటికి వచ్చిన అతిథులకు మర్యాదలో భాగంగా మీఠాపాన్ అగ్రతాంబూలం'గా ఉంటోంది. మారుతున్న జనాల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త రుచుల్లో మీఠాపాన్‌లను జనాలు ఇష్టపడుతున్నారు. కిల్లీ కొట్లలో సీనియర్ సిటిజన్స్ కొందరు తరతరాలుగా పాన్‌లు కడుతూ షాన్‌దార్‌గా ఉపాధి పొందుతున్నారు. సిరిసిల్లలో లభిస్తున్న స్వీట్ పాన్‌లపై సండే స్పెషల్ స్టోరీ.

సండే స్పెషల్



చేతి వృత్తిలో అగ్ర'తాంబూలం'

చేతి వృత్తిలా సిరిసిల్లలో కొందరు సీనియర్ సిటిజన్స్ పాన్ షాపులు తరతరాలుగా నిర్వహిస్తున్నారు. పాన్‌లు తినే అలవాటు తరతరాలుగా వస్తున్న ఆచారం. బామ్మలు, మామ్మలు, తాతయ్యలు పాన్ నములుతూ కనిపించడం పలు ఇండ్లలో పరిపాటే. పాతకాలం రోజుల నుంచి ఇప్పటి వరకు పాన్‌ల తయారీలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నా ఆదరణ మాత్రం తగ్గలేదు. ఒకప్పుడు ఇత్తడి పాన్‌దాన్ (తాంబూలం డబ్బా) ఉండని ఇల్లు ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. ఇంటికి వచ్చిన అతిథులకు ఇష్టమైన భోజనం వడ్డించడమే కాదు పసందైన పాన్ అందించడం కూడా మర్యాదలో భాగమే. ఇలా మన సంస్కృతిలో పాన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. పాన్‌లలో వివిధ రకాలను బట్టి ఫంక్షన్లలో అతిథులకు తాంబూలాన్ని అందిస్తుండటంతో పాన్‌దార్‌లకు ఆదరణ పెరిగింది.

తరాలు మారినా..

పట్టణంలో కొంతమంది పాన్‌టేలాదారులు నాలుగైదు దశాబ్దాలు, మరి కొందరు తరతరాలుగా ఇదే వృత్తితో ఉపాధి పొందుతున్నారు. వీరికి ఎంత క్రేజ్ అంటే పలాన చోట పలానవ్యక్తి పాన్‌షాపు వద్ద తమ ఇల్లు, దుకాణం అంటూ ల్యాండ్‌మార్క్ చెప్పుకోవడం విశేషం. పాన్‌దార్‌లకు ప్రజల్లో ఉన్న ఆదరణతో ఏళ్లతరబడిగా నిరంతర ఉపాధి పొందుతున్నారు. పాత రోజుల్లో పట్టణంలో ఫకీర్, మురళి, పాండు, ఎల్లయ్య, నారాయణ, వెంకన్న, రవి, లక్ష్మన్, మొహియొద్దీన్, సత్యనారాయణ, రాజు తదితరులు పాన్‌డబ్బాలు నడిపించేవారు. ఇందులో కొంతమంది వారసులు ఇప్పటికీ అదే వృత్తితో జీవనం సాగిస్తున్నారు.

'స్వీట్'గా నమిలేస్తున్నారు

మారిన అలవాట్లు.. పొగాకు ఆరోగ్యరీత్యా మంచిది కాకపోవడంతో ప్రజలు వాటికి దూరంగా ఉంటున్నారు. తమలపాకులో ఆకు, వక్క, సున్నం, కాసు, మీఠా ఇలా తయారయ్యే స్వీట్‌పాన్‌లను చాలా మంది ఇష్టపడుతున్నారు. ఇక సిరిసిల్లలోని కిల్లీకొట్లలో హైదరాబాద్ తరహాలో అన్ని ఫ్లేవర్స్‌లో స్వీట్‌పాన్లు దొరుకుతున్నాయి. వీటిలో స్వీట్‌పాన్, మీనాక్షి, రామ్‌ప్యారి, మలాయ్, డ్రైఫ్రూట్, చట్నీ, స్ట్రాబెరీ, కుల్ఫీ, కిట్‌కాట్, చాక్‌లెట్, చుమ్కీ, సిల్వర్, షాహి, ఐస్‌ఫైర్, బనారసి, పాన్‌షాట్స్, మ్యాంగో, రాత్రాని చట్నీ, పైన్‌యాపిల్, ఇలాచి చట్నీ తదితర పాన్‌లను తయారీదారులు అందిస్తున్నారు. వీటితో పాటు వెనీలా, బటర్‌స్కాచ్, చాక్‌లెట్, స్ట్రాబెరీ వంటి ఐస్‌క్రీంలతో కలిపిన స్పెషల్ వెరైటీ పాన్‌లు లభ్యమవుతున్నాయి.



పాన్‌లు కడుతున్న వెంకన్న

కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు..



పాన్‌లు తినేవారిలో ఒక్కొక్కరు ఒక్కో రుచిని ఇష్టపడుతుంటారు. వారికి నచ్చేలా పాన్ కట్టిస్తుంటాం. నేను సిరిసిల్ల పాతబస్టాండ్ వద్ద 35 ఏళ్లుగా పాన్‌టేలా నిర్వహిస్తున్నాం. మా మామ, మా తమ్ముడు నాకు సహకరిస్తుంటారు. నాకు పాన్‌షాప్ వెంకన్నగా గుర్తింపు రావడం గర్వంగా ఉంది.

– కుషిగుంపుల వెంకన్న, సిరిసిల్ల

మూడుతరాలు ఇదే వృత్తిలో..



మా నాన్న యాకూబ్ అలీ గాంధీసెంటర్‌లో 65 ఏళ్ల క్రితం పాన్‌షాపు నిర్వహించారు. ఆయన తర్వాత నేను 45 ఏళ్లుగా నడిపిస్తున్నా. ఇప్పుడు నా కొడుకు షౌకత్ కూడా ఇదే వృత్తిలో రాణిస్తున్నాడు. నేను కట్టే పాన్‌లను మెచ్చి మంచి గిరాకీ వస్తుండడంతో ఈ వృత్తి నాకు సంతృప్తినిస్తుంది.

– ఫకీర్ పాషా, సిరిసిల్ల

షిఫ్ట్‌వైస్‌గా..



నేను 35 ఏళ్లకు పైగా పాన్‌టేలా నిర్వహిస్తున్నా. మా ఇద్దరు అబ్బాయిలు మహేందర్, సాయిచంద్‌తో కలిసి మూడు షిఫ్టుల్లో షాప్ నడిపిస్తాం. ఉదయం 4 గంటల నుంచి రాత్రి బస్సులు బంద్ అయ్యేవరకు షాప్ నిర్వహిస్తాం. వందలాది సంఖ్యలో పాన్ అభిమానులు మావద్దకు వచ్చి ఆప్యాయంగా పలుకరిస్తూ పాన్‌లు తింటారు.

– ఎంబేరి దేవేందర్, సిరిసిల్ల

కార్యకర్తలకు అండగా ఉంటాం

ముస్తాబాద్: కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడు అండగా ఉంటామని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. చిప్పలపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాపురెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. బాపురెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని పేర్కొన్నారు. అలాగే అనారోగ్యానికి గురైన నాల్ల చారిని పరామర్శించారు. మెరుగైన వైద్యానికి సాయం అందిస్తామన్నారు. పాత్రికేయుడు గున్నాల పర్శరాములు తల్లి ఇటీవల మృతి చెందగా, అతడిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గజ్జెల రాజు, కొండల్‌రెడ్డి, గుండెల్లి శ్రీను, వెల్ముల రాంరెడ్డి, రాజిరెడ్డి, ధర్మేందర్, తలారి నర్సింలు, రాజు తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి, నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోయిని బాబు ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సత్తు శ్రీనివాస్‌రెడ్డి, రైతు సెల్ మండల అధ్యక్షుడు పొన్నాల పరుశరాములు పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందజేశారు.

సాహిత్యరంగంలో రాణించాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, సాహిత్యరంగంలో రాణించాలని బాలసాహితీ వేత్త వాసరవేణి పర్శరాములు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో ఈ వారంలో నిర్వహించే పిల్లల సృజనాత్మక రచనా శిల్పశాల కార్యక్రమం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు అవ్వా.. తాతలపై లేఖ రచన, తెలుగు కథ, కవిత్వం, చిత్రలేఖనంపై కార్యశాల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, ఆర్.గీత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

'చలో హైదరాబాద్' తరలిన ఆసాములు, కార్మికులు



హైదరాబాద్‌కు వెళ్తున్న ఆసాములు, కార్మికులు

తంగళ్లపల్లి: వస్త్ర వ్యాపార అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తంగళ్లపల్లి, పద్మనగర్ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆసాములు, పవర్లూమ్ కార్మికులు తరలివెళ్లారు. శనివారం తంగళ్లపల్లి నుంచి బస్సు ఏర్పాటుచేయగా రిలే నిరాహార దీక్షకు బయలుదేరారు. చేనేత నాయకులు మోర కిరణ్, సామల శ్రీనివాస్, కుమ్మరికుంట శ్రీహరి, వేముల బాలకిషన్, గజ్జెల్లి శ్రీనివాస్, కుడిక్యాల కనకయ్య తదితరులున్నారు.

పనులు పర్యవేక్షించిన ఎంపీడీవో

బోయినపల్లి: ఇటీవల కురుస్తున్న వరుస వర్షాలకు విద్యార్థులు, ప్రజలు ఇబ్బందిపడకుండా చూడాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు శనివారం మండలంలో పలు పనులను ఎంపీడీవో బీమా జయశీల క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. నర్సింగాపూర్, విలాసాగర్, మర్లపేట గ్రామాల మీదుగా బోయినపల్లి మండలకేంద్రానికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తీయించారు. అలాగే కేజీబీవీ పాఠశాల ఎదుట డ్రైనేజీ సిస్టం సరిగా లేక దుర్వాసన రావడంతో అక్కడ కచ్చా డ్రెయిన్ చేయించారు. మాజీ సర్పంచు సంబ లక్ష్మీరాజం, పర్యవేక్షకులు రవీందర్, ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల, పాఠశాలల్లో హరితహారం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, టాస్క్ కన్వీనర్ శ్రవణ్‌కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వాణి, అధ్యాపకులు ఆది విష్ణు, బిక్షమయ్య, మనోహర్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

బోయినపల్లి: ఏకో క్లబ్ ఫర్ మిషన్ లైవ్‌లో భాగంగా మండలంలోని ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మొక్కలు నాటారు. హెడ్‌మాస్టర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని మోడల్‌స్కూల్, గర్జనపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిలు వారి తల్లులతో కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ విశ్వనాథం, గర్జనపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, నరేశ్‌కుమార్, ప్రతాప్‌కుమార్, కులేరి ప్రేమ్‌సాగర్, బలరాంనాయక్, ఉమారాణి, మంజుల, విద్యార్థుల తల్లులు మల్యాల సరిత, లత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లకల్చరల్: గురుకుల విద్యాసంస్థలో అనుమానాస్పదంగా మరణించిన విద్యార్థి ఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్‌ఎస్ భవన్‌లో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా విద్యార్థుల మరణానికి కారణమవుతోందని విమర్శించారు. హాస్టళ్లలో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై ప్రత్యేక కమిటీ వేసి కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. నాణ్యమైన ఆహారంతో పాటు విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, నవీన్, కోడం వెంకటేశ్, రుద్రవేణి సుజిత్, కోడి రోహిత్, సాయి, హర్షిత్ అరవింద్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన దుబాయ్ వలస కార్మికుడు ఎరుపుల బాబు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి కోరారు. బాబు బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైంది. అక్కడే చికిత్స చేయించుకొని అప్పులతో 10 రోజుల క్రితం స్వగ్రామం చేరాడు. అప్పుల బాధతో ఇంటికి వచ్చిన గల్ఫ్ కార్మికునికి సాయం అందించాలన్నారు. అలాగే బండలింగంపల్లికి చెందిన ఎలుసాని ఎల్లారెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నర్సింలు, రాజయ్య, ఎలగందుల నర్సింహులు, జోగి ఎల్లయ్య, అంగూరి ఎల్లయ్య తదితరులున్నారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ అన్నారు. శనివారం మండల విద్యాధికారి బన్నాజీకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొందరు అనుమతి లేకుండా ప్రైవేటు స్కూళ్లు నడిపిస్తూ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఆట స్థలం, మౌలిక వసతులు కల్పించకుండా తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. కనీస విద్య అర్హతలు లేనివారిని ఉపాధ్యాయులుగా నియమించి విద్యను భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. ఏటా ప్రైవేటు పాఠశాలలను సందర్శించి చర్యలు తీసుకోవాలని లేకుంటే ధర్నాలు చేపట్టి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల దిలీప్, రాకేశ్, సందీప్, ప్రమోద్, వేణు తదితరులు ఉన్నారు.



ఎంఈవో బన్నాజీకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ తెలిపారు. తంగళ్లపల్లి, మండెపల్లి, తాడూర్, గోపాలరావుపల్లె గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుద్రంగిలో..

రుద్రంగి: మండలలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రుద్రంగి, కొత్తపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మహేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బద్దం శ్రీనివాస్‌రెడ్డి (48) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఐదేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం ఆరోగ్యం క్షీణించి తుదిశ్వాస విడిచారు. తోటి ఉపాధ్యాయుడి మృతితో పాఠశాల సిబ్బంది సంతాపం తెలియజేశారు.

నోట్ బుక్కులు అందజేత

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి, వెంకట్రావుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వెంకట్రావుపల్లి రూసా కళాశాల చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు ఆధ్వర్యంలో శనివారం నోటు బుక్కులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా నూరు వరహాల మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ దేవేందర్, రిటైర్డ్ ఎంఈవో రామరాజు, సంపత్, మాజీ సర్పంచు బూర్గుల నందయ్య, మేడిద మల్లయ్య, హెచ్‌ఎంలు భూక్యా తిరుపతి, వేణుగోపాలాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు రెయిన్‌కోట్లు..

వేములవాడరూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలను కూడా లెక్కచేయకుండా రోడ్లు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులకు రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెయిన్ కోట్లు అందజేశారు. మండలంలోని నూకలమర్రి గ్రామపంచాయతీలో పని చేస్తున్న పలువురు కార్మికులకు రోమాల ప్రవీణ్‌కుమార్ అందజేశారు. కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, గ్రామ అధ్యక్షుడు పాలకుర్తి పర్శరాములు, బొడ్డు రాములు, రమ, సామల్ల కమలాకర్, ప్రశాంత్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన వేగండ్ల సరోజన, కుమ్మరి లక్ష్మికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, నాగుల రాము, అంబటి చంద్రశేఖర్, తోట రాజు, కొండ శేఖర్, లాల నగేశ్, వస్తాద్ కృష్ణగౌడ్, మహేశ్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ పంపిణీ చేశారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గోరింటాల గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, నాయకులు నాగభూషణం, పూజం భూమరాజం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దమ్మన్నపేట, గోరింటాలలో పలువురిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. గోరింటాలలో కోటగారి లింగం తల్లి ఇటీవల మృతి చెందింది. ఆయన కుటుంబాన్ని కేకే పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సిరిసిల్లలో..

సిరిసిల్ల కల్చరల్: పట్టణంలోని మూడోవార్డుకు చెందిన లబ్ధిదారులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. పి.భారతి రూ. 21,000, పి. లక్ష్మి రూ.18,500, పి.అనూష రూ.11,500, జి.సుష్మ రూ.11,500 చొప్పున చెక్కులు అందుకున్నారు.

ముందస్తు బోనాల పండుగ



సిరిసిల్ల/సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని గోపాల్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం ముందస్తు బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు బోనం ఎత్తుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్‌ఎం వేణు ఉపాధ్యాయులు కవిత, సౌమ్య, మమత, భవాని, రవళి తదితరులు పాల్గొన్నారు.